క్లుప్తంగా

పారిశుధ్యాన్ని మరింత మెరుగుపర్చాలి

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలో పారిశుధ్య పనులను మరింత మెరుగు పర్చాలని ఈవోపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. ఆ గ్రామంలో జరుగుతున్న పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో ఇటీవల సూర్యనారాయణమూర్తి కల్యాణం జరిగిన నేపథ్యంలో అన్నిచోట్లా పారిశుధ్య పనులు చేపట్టారన్నారు. తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించేలా వారికి సూచనలు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి నాగేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శాంతి కల్యాణం



పందలపాకలో శాంతి కల్యాణం జరిపిస్తున్న మోహన్ కృష్ణ దంపతులు

బిక్కవోలు: పందలపాక గ్రామంలోని వెలమపేట రామాలయంలో కొలువైన సీతారాములకు సోమవారం శాంతి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఐదో వార్షికోత్సవం సందర్భంగా అర్చకుడు గరిమెళ్ల సత్య ప్రకాష్ (వెంకన్న పంతులు) ఆధ్వర్యంలో అనపర్తికి చెందిన సబ్బారపు మోహన్‌కృష్ణ, శివ పార్వతి దంపతులు కల్యాణ కర్తలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో సబ్బారపు శ్రీనివాస్, గొర్రిపోటి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీ సీజ్



సీతానగరం పోలీస్ స్టేషన్ వద్ద సీజ్ చేసిన లారీ

సీతానగరం: వంగలపూడి ర్యాంపు రీచ్–1 నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని సోమవారం డిస్ట్రిక్ట్ శాండ్ ట్రాస్క్‌ఫోర్స్ ఎస్సై ఎ.ప్రసాద్ సీజ్ చేశారు. ఆయన మాట్లాడుతూ వంగలపూడిలో ఇసుక లారీని ఆపి తనిఖీ చేయగా, ఇసుక రవాణాకు సంబంధించి ఎటువంటి రికార్డులు, బిల్లులు లేవన్నారు. లారీలో ఇరవై టన్నుల ఇసుక ఉందన్నారు. దీంతో లారీని స్వాధీనం చేసుకుని, స్థానిక పోలీస్ స్టేషన్‌కు అప్పగించామని, వారు మైన్స్ డిపార్టుమెంటుకు తెలియపర్చుతారన్నారు.

నేటి నుంచి పాశాలమ్మ జాతర

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి గ్రామ దేవత పాశాలమ్మ జాతర మంగళవారం నుంచి ఈ నెల 13వ తేదీ వరకూ జరగనుంది. ఈ మేరకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. మొదటి రెండు రోజులూ హోమాలు, అమ్మవారికి విశేష పూజలు, కుంకుమార్చనలు నిర్వహిస్తారు. చివరి రోజు అమ్మవారి నూతన విగ్రహ ప్రతిష్ఠ, అన్నసమారాధన జరుగుతాయి.

చంద్రశేఖరస్వామికి పూజలు

రంగంపేట: చండ్రేడు గ్రామంలో కొలువైన కాత్యాయనీ సమేత చంద్రశేఖరస్వామి దేవాలయంలో స్వామివారికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు మైలవరపు కృష్ణశర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం స్వామిని సుందరంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి, స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

జాతీయ సమైక్యతా శిబిరంలో గైట్ ఫార్మసీ వలంటీర్లు

రాజానగరం: కేంద్ర యువజన, క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సమైక్యతా శిబిరంలో స్థానిక గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు జి.సాయి, శశాంక్, పి.సుచిత్ర పాల్గొన్నారు. ఈ నెల 3 నుంచి 9 వరకు పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురంలోని వైఎన్ కళాశాలలో జరిగిన సమైక్యతా శిబిరంలో ఆంధ్ర యూనివర్సిటీ తరఫున ఈ విద్యార్థులు హాజరయ్యారు. వారికి ఎన్ఎస్ఎస్, రీజినల్ డైరెక్టర్ (హైదరాబాద్) ఎం.రామకృష్ణ సర్టిఫికెట్లు అందజేశారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండీ ధనరాజ్, ఎన్ఎస్ఎస్ పీఓ షేక్ మీరాలు తెలిపారు.

మిర్తిపాడులో బర్డ్ ఫ్లూ

సీతానగరం: మిర్తిపాడులోని కోళ్లఫాంలో బర్డ్ ఫ్లూ సోకినట్టు నిర్ధారణ అయ్యిందని తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. ఆయన సోమవారం మాట్లాడుతూ బర్డ్ ఫ్ల్యూ నేపథ్యంలో కోళ్ల ఫాంలో నమూనాలు సేకరించి, ల్యాబ్‌కు పంపగా బర్డ్ ఫ్ల్యూగా తెలిందన్నారు. కోళ్ల ఫారం చుట్టూ కిలోమీటరు పరిధిలో ప్రజలు సంచరించవద్దన్నారు. అలాగే కోడిమాంసం తినవద్దని ప్రజలకు సూచించారు.

అమెరికా తీరు దారుణం

మధురపూడి: అమెరికా నుంచి భారతీయులను తరలింపు విషయంలో ఆ ప్రభుత్వం అవమానకరంగా వ్యవహరిస్తోందని అఖిల భారత రైతు కూలీ సంఘం ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వెంకట నాయుడు అన్నారు. నేరస్తుల మాదిరిగా వారి చేతులకు బేడీలు, కాళ్లకు సంకెళ్లు వేయడం అమానుషమన్నారు. 104 మంది భారతీయులపై అవమానకరంగా వ్యవహరించిన అమెరికా సామ్రాజ్యవాద దురంహకార వైఖరిని ఖండించారు. అమెరికా అనుసరించిన ఈ తీరును ప్రభుత్వం ఖండించకపోవడం సిగ్గుచేటన్నారు.

వాతావరణం.. పూతకు ప్రతికూలం

- వెలవెలబోతున్న మామిడితోటలు
- అదునుదాటుతున్నా కనిపించని పూత
- దిగుబడిపై తీవ్ర ప్రభావం పడే అవకాశం
- ఆందోళనలో రైతులు



పూత ఆలస్యంగా వస్తున్న మామిడి తోట

రంగంపేట: మామిడి చెట్లు పూతతో కళకళలాడుతూ కనిపించాల్సిన సమయమిది. నవంబరు నుంచి డిసెంబరు నెలాఖరు వరకు పూత పట్టాలి. జనవరిలో గుత్తులుగా విరగ్గాయాలి. ఇంతవరకూ ఈ పరిస్థితి కనిపించలేదు. దీని ప్రభావం దిగుబడిపై పడనుంది. మామిడి కొమ్మకు ఏమైందో, మధుర ఫలం దక్కుతుందో, లేదోననే గుబులు రైతులకు మొదలైంది.

పగబట్టిన ప్రకృతి

మామిడి రైతును ప్రకృతి పగబడుతోంది. వాతావరణంలో మార్పుల కారణంగా ఈ ఏడాది కూడా పూతలు రావడం ఆలస్యమవుతోంది. ప్రతి ఏటా నవంబరు, డిసెంబరులో మామిడి చెట్లు పూతతో నిండి ఉంటాయి. కానీ వాతావరణ మార్పుల కారణంగా ఫిబ్రవరి మొదటి వారం దాటిపోయినా పూత జాడలేదు. ఏ చెట్టు చూసినా ఇగురుగానీ, పూతగానీ లేక వెలవెలబోయి కనిపిస్తున్నాయి. ఇప్పటి వరకు పూత పూయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పూత కోసం వేల రూపాయలు ఖర్చు చేసి పురుగు మందులు పిచికారీ చేసిన రైతులకు తీవ్ర నిరాశే మిగిలింది. పూత జాడ పెద్దగా కనిపించక పోవడంతో వ్యాపారులు తోటలు కొనడానికి వెనుకంజ వేస్తున్నారు.

దిగుబడిపై ప్రభావం

ఈసారి మామిడి పూత ఆలస్యం కావడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. దీని వల్ల పంటచేతికొచ్చే సమయానికి వర్షాలకు నేలపాలవుతుందనే ఆందోళన రైతులను వెంటాడుతోంది. మామిడి దిగుబడి బాగుంటే హెక్టారుకు 8 వేల టన్నుల వరకూ దిగుబడి వస్తుంది. ప్రతి ఏడాదీ డిసెంబరు నెలాఖరు, జనవరి మాసాల్లో పూర్తి స్థాయిలో పూత వస్తుంది. ఏప్రిల్ రెండో వారం నుంచి పంట కోత దశకు చేరుకుంటుంది. అప్పటి నుంచి జూన్ మొదటి వారం వరకు మామిడి కాయలు కోతలు కొనసాగుతాయి. తొలిగా వచ్చిన పంటకు మార్కెట్‌లో ధర బాగా దక్కుతుంది. ఆలస్యంగా కోతకు వస్తే ఆశించిన స్థాయిలో ధరలు ఉండవు. ఈసారి ఆలస్యంగా పూత రావడంతో ఆశాజనకంగా దిగుబడి వస్తుందా, అదే స్థాయిలో ధర దక్కుతుందా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లో..

అనపర్తి నియోజకవర్గంలోని అనపర్తి మండలంలో 262, బిక్కవోలు మండలంలో 407, రంగంపేట మండలాల్లో 770 ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. రాజానగరం నియోజకవర్గంలోని సీతానగరం మండలంలో 220, కోరుకొండ మండలంలో 4050, రాజానగరం మండలంలో 1550 ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి.

పొంచి ఉన్న తెగుళ్ల బెడద

మామిడి తోటలు ఆలస్యంగా పూత పూయడంతో తెగుళ్లు సోకే అవకాశం ఉందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తెగుళ్ల నివారణకు ఉద్యానవన శాఖ అధికారులు తోటలు వద్ద రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి గ్రామంలోనూ ఏర్పాటు చేస్తున్న పొలంబడి కార్యక్రమంలోనూ రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వం శ్రద్ధ పెట్టి సబ్సిడీతో పురుగు మందులతో పాటు మామిడి చెట్లను కత్తిరించేందుకు పరికరాలు, వ్యవసాయ పనిముట్లు అందించాలని రైతులు కోరుతున్నారు.

నివారణ చర్యలు



కోటపాడులో మామిడి రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యానవన అధికారి దివ్యశ్రీ

- ఇంకా పూతరాని తోటల్లో 13–0–45 మందు 10 గ్రాములను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే పూత వచ్చే అవకాశం ఉంటుంది. పూత వచ్చిన తోటల్లో పూత నిలబడటానికి, కాయ రాలడం నివారణకు ప్లానోఫిక్స్ 0.2 మిల్లీలీటర్లను లీటరు నీటిలో కలిపి పిందె కట్టిన తర్వాత మళ్లీ పిందె గోళీ సైజులో ఉన్నప్పుడు పిచికారీ చేయాలి.
- సూక్ష్మ పోషకాల కోసం మల్టీప్లెక్స్, మల్టీ మాక్స్ 3 గ్రాముల లీటరు నీటిలో పిచికారి చేయాలి. తేనె మంచు పురుగు, మొగ్గ తొలుచు పురుగు నివారణకు క్లోర్‌పైరిఫోస్ లేదా ప్రొఫెనోఫాస్ 2 మిల్లీ గ్రాములను లేదా ఇమిడాక్లోప్రిడ్ 1 మిల్లీ గ్రాములను లీటరు నీటికి కలిపి కొమ్మలు బాగా తడిచేటట్లు పిచికారి చేయాలి.
- బూడిద తెగులు, మసి తెగులు మరియు పక్షికన్ను తెగులు నివారణకు హెక్సాకోనజోల్ 2 గ్రాములను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- పూత పూర్తిగా విచ్చుకున్న సమయంలో మందులు, ఎరువులు పిచికారీ చేయరాదు. పిందె ఏర్పడిన తర్వాత ఫిబ్రవరి చివరి వారంలో లేదా మార్చి మొదటి వారంలో ప్రతి చెట్టుకు 500 గ్రాముల యూరియా, 1000 గ్రాములు ఎస్ఎస్‌పి, 500 గ్రాములు ఎంవోపీ ఎరువులు వేయాలి.

ప్రభుత్వం ఆదుకోవాలి



మామిడి సాగు ఆశాజనకంగా లేదు. ప్రతి ఏడాదీ నష్టపోతున్నాం. 2.5 ఎకరాల్లో మామిడి తోట సాగు చేస్తున్నాను. చెట్లను కాపాడుకునేందుకు చెట్ల చుట్టూ చక్రాలు కట్టి నీరు పెడుతున్నాం. ఎరువులు, పురుగు మందులకు భారీగా పెట్టుబడి పెడుతున్నాం. ప్రభుత్వం సబ్సిడీ ద్వారా ఎరువులు, పురుగు మందులతో పాటు పండు ఈగ బుట్టలు ఉచితంగా అందించి ఆదుకోవాలి.

– తోట సూర్య భాస్కరరావు, మామిడి రైతు, దొడ్డిగుంట

అవగాహన కల్పిస్తున్నాం



మామిడి రైతులకు ప్రస్తుతం ప్రభుత్వం నుంచి ఎటువంటి స్కీములు రాలేదు. స్కీములు వస్తే రైతులకు సమాచారం ఇస్తాం. గత ఏడాది లాగానే ఈసారి కూడా మామిడి పూత ఆలస్యంగా వస్తుంది. అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, రాజానగరం మండలాలకు చెందిన మామిడి రైతులకు మామిడిలో సస్యరక్షణపై అవగాహన కల్పించాం. వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో పూత రావడం ఆలస్యం అవుతుంది. ఈ ఏడాది కూడా దిగుబడి తగ్గే అవకాశం ఉంది.

– కె.దివ్యశ్రీ, ఉద్యానశాఖాధికారి, రంగంపేట మండలం

అయ్యవారి ఫ్లెక్సీకి అడ్డేముంది!



కోరుకొండలోని జనసేన కార్యాలయం వద్ద ఎమ్మెల్యే బలరామకృష్ణ ఫ్లెక్సీ



అదే గ్రామంలో బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు ఫ్లెక్సీపై వేసిన ముసుగు

- పట్టించుకోని అధికారులు
- వర్తించని ఎమ్మెల్సీ ఎన్నికల నిబంధనలు

మధురపూడి: ఉభయ గోదావరి జిల్లా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. దీని ప్రకారం రాజకీయ నాయకుల విగ్రహాలు, ఫ్లెక్సీలకు ముసుగులు వేయాల్సి ఉంది. కానీ ఈ నిబంధనలు సక్రమంగా అమలు కావడం లేదు. కోరుకొండ ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న జనసేన పార్టీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఫ్లెక్సీ దీనికి నిదర్శనంగా నిలిచింది. నిబంధనల ప్రకారం దీన్ని మూసివేయాలి. కానీ అయ్యవారి ఫ్లెక్సీ కదా అని అధికారులు వదిలేసినట్టున్నారు. మిగిలిన రాజకీయ నాయకుల ఫ్లెక్సీలను, విగ్రహాలను మూసేసినా.. దీనివైపు మాత్రం కన్నెత్తి చూడలేదు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎస్‌బీఐ మేనేజర్ కిశోర్

సీతానగరం: మండలంలోని బొబ్బిల్లంక జిల్లా పరిషత్ హైస్కూల్లో మెరిట్ విద్యార్థులకు స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సైకిళ్లు పంపిణీ చేశారు. హెచ్‌ఎం కోలా త్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఎస్‌బీఐ తొర్రేడు శాఖ మేనేజర్ కిశోర్ చేతుల మీదుగా ఇద్దరు విద్యార్థులకు సైకిళ్లు అందించారు. ఆయన మాట్లాడుతూ బాలికల విద్యను ప్రోత్సహించడానికి బ్యాంకు తరఫున వీటిని అందజేశామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుందరరావు, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

రామభక్తులకు అల్పాహారం పంపిణీ



దివాన్ చెరువులో రామభక్తులకు అల్పాహారం అందిస్తున్న దాతలు

రాజానగరం: లోక కల్యాణార్థం సామర్లకోట నుంచి భద్రాచలానికి చేపట్టిన దివ్య రథోత్సవ పాదయాత్ర సోమవారం ఉదయం దివాన్ చెరువుకు చేరుకుంది. ఆంజనేయస్వామి మాల దీక్షలో ఉన్న 203 మంది సీతారామాంజనేయ భక్తులు 'శ్రీరామ సంకీర్తనలు' ఆలపిస్తూ ఈ యాత్ర చేస్తున్నారు. ఈ విధంగా తమ గ్రామం చేరుకున్న వారిని ఆర్య వైశ్య సంఘ నాయకులు గ్రంధి నానబ్బులు సంఘ సభ్యులు, కుటుంబ సభ్యులతో కలసి స్వాగతం పలికి, అల్పాహార విందును ఏర్పాటు చేశారు. సామర్లకోట సమీపంలోని అచ్చంపేట వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి శనివారం బయలు దేరిన ఈ పాదయాత్ర రాజమహేంద్రవరం, కొయ్యలగూడెం, అశ్వారావుపేట, ఊలపల్లి, వేలేరు, భూర్గుంప హాడ్‌ల మీదుగా 16 రాత్రికి భద్రాచలం చేరుకుంటుందని వాసుదేవ గురుస్వామి తెలిపారు. ఈ విధంగా గత 14 సంవత్సరాలుగా పాదయాత్ర చేస్తున్నామన్నారు. దారిలో ప్రతిచోట ఆలయాల వద్దనే ఆగి, దాతల సహకారంతో అల్పాహారం, భోజనాలు చేస్తూ, యాత్రను కొనసాగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్థానిక ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు మండవెల్లి వెంకన్నబాబు, గ్రంధి రాజా, నాగబాబు, ముత్తా రామకృష్ణ, కంకటాల మూర్తి పాల్గొన్నారు.

ఫ్లెక్సీలను తొలగించారు

సాక్షి ఇంపాక్ట్

సీతానగరం: మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న ఫ్లెక్సీలను యుద్ధప్రాతిపదికన తొలగించారు. కొన్నింటిపై ముసుగులు వేశారు. 'ఎన్నికల కోడ్ ఉన్నా... పట్టించుకోరు!' అనే శీర్షికతో సోమవారం సాక్షి పత్రికలో కథనం వచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎంపీడీవో ఎం.భారతి ఆదేశాల మేరకు పంచాయతీ సిబ్బంది చర్యలు తీసుకున్నారు. ముగ్గళ్ల, వెదుళ్లపల్లి, వంగలపూడి తదతర గ్రామాల్లోని ఫ్లెక్సీలను పంచాయతి కార్యదర్శులు, వీఆర్వోలు దగ్గరుండి కొన్ని ఫ్లెక్సీలను తొలగించారు. మరికొన్నివాటిపై బరకాలు, పచ్చని క్లాత్‌తో మూత వేశారు.



ముగ్గళ్లలో ఫ్లెక్సీలపై వేసిన ముసుగులు

అంగరంగ వైభవంగా వీరభద్రుడి సంబరం



పందలపాకలో గద్దె వద్ద వీరభద్రుడికి పూజ చేస్తున్న భక్తులు



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామంలో వీరభద్రుడి సంబరాన్ని సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గుల్లిపల్లి, కర్రి, యాసలపు, కొటాని, లగుడు వంశీయులు కలిసికట్టుగా 40 ఏళ్ల క్రితం ఈ సంబరం నిర్వహించారు. అప్పటి నుంచి మరలా ఎవరి వారి తీరు అన్న విధంగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో దాదాపు 40 ఏళ్ల తర్వాత వీరంతా కలిసి ఎంతో ఘనంగా ఈ వేడుక జరిపారు. ముందుగా వీరభద్రుడు గద్దె వద్ద ప్రత్యేక పూజలు చేశారు. సంబరంలో తీన్మార్ డప్పులు, సన్నాయి మేళాలు, కేరళ వాయిద్యాలు, శక్తి వేషధారణలు ఆకట్టుకున్నాయి. శివాలయం జమ్మి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు అనంతరం మళ్లీ గ్రామోత్సవంతో గద్దె వద్దకు తీసుకువచ్చి పూజలు చేశారు. కార్యక్రమంలో భాగంగా భారీ ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు.



ఆకట్టుకున్న వేషధారణలు

లబ్ధిదారుల వివరాలు సేకరించండి

పెదపూడి: జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారుల్లో అర్హులు, అనర్హులు తదితర వివరాలు ఈ నెల 20వ తేదీ లోపు సేకరించాలని అధికారులను తహసీల్దార్ పీవీ సీతాపతిరావు, ఎంపీడీవో కె.నరేందర్‌రెడ్డి ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సచివాలయం, రెవెన్యూ కార్యదర్శులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న కాలనీలో ఇళ్ల పట్టాలు తీసుకున్న వారి అర్హతలు, రిజిస్ట్రేషన్ చేయించుకున్న, అమ్మకాలు చేసిన, ఒక ఇంట్లో రెండు స్థలాలు పొందిన, పేదవారిగా పేరు నమోదు చేయించుకుని ఇళ్లస్థలం పొంది విలాసవంతంగా ఇల్లు పెంచుకున్న, నాలుగు చక్రాల వాహనాలు ఉన్న , కరెంట్ బిల్లు ఎక్కువగా వచ్చిన వారి తదితర వివరాలు సేకరించాలన్నారు. కార్యక్రమంలో ఈవో పీఆర్డీ డి. సత్యనారాయణ రెడ్డి, పంచాయతీ, రెవిన్యూ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రాణాలను కాపాడే ఇంజెక్షన్‌పై అవగాహన



మాట్లాడుతున్న సీహెచ్‌సీ సూపరింటెండెంట్ అనూష

పెదపూడి: గుండెపోటు వచ్చిన వారిని ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడే విలువైన ఇంజెక్షన్ స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉందని ఆ ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ పి.అనూష తెలిపారు. పెదపూడి సామాజిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ప్రజలకు ఈ ఇంజెక్షన్‌పై అవగాహన కల్పించారు. డాక్టర్ అనూష మాట్లాడుతూ గుండెపోటుతో ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి సుమారు రూ.45 వేల విలువ గల ఇంజెక్షన్ ఉచితంగా చేస్తారన్నారు. తద్వారా రోగి ప్రాణానికి ముప్పు తప్పుతుందని ఆమె తెలిపారు. ఎడమ వైపు ఛాతీ నొప్పి, ఆకస్మిక ఆయాసం, గుండె దడ, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు గుండె నొప్పికి సంకేతాలుగా చెప్పవచ్చున్నారు. కార్యక్రమంలో వైద్య నిపుణులు శ్రావణి, హర్షవర్ధన్, వరప్రసాద్, సుభాష్, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై అంధకారం



లాలాచెరువు వద్ద వెలగని వీధి దీపాలు

రాజానగరం: జాతీయ రహదారి డివైడర్లపై ఏర్పాటు చేసిన వీధి దీపాలు కొన్నిచోట్ల వాటి ఉనికినే కోల్పోతున్నాయి. రాత్రి సమయాలలో ప్రమాదాల నియంత్రణకు వీటిని ఏర్పాటు చేశారు. ఆ విషయాన్ని సంబంధిత విస్మరిస్తున్నారో లేక నిర్లక్ష్యం చూపుతున్నారో తెలియదు గానీ లాలాచెరువు, రాజానగరం వంటి జన సాంద్రత అధికంగా ఉండే ప్రాంతాలలో రాత్రి వేళల్లో ఇవి వెలుగడం లేదు. రాజమహేంద్రవరానికి చేరువలో ఉన్న లాలాచెరువు హౌసింగ్ బోర్డు ప్రాంతంలో జాతీయ రహదారిపై ఈ వీధి దీపాలు ఎప్పుడూ వెలగడం లేదని ఆ ప్రాంత వాసులు చెబుతున్నారు. రాజానగరం – ఏడీబీ రోడ్డు కూడలిలో కూడా ఆదే పరిస్థితి నెలకొంది.

నులి పురుగుల నివారణతో ఆరోగ్యం



రంగంపేట హైస్కూల్లో విద్యార్థినికి ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న సమ్మికుమార్

రంగంపేట: నులి పురుగుల నివారణతోనే మంచి ఆరోగ్యం సాధ్యమని రాజమహేంద్రవరం డీఎం అండ్ హెచ్‌ఓ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సమ్మికుమార్ అన్నారు. రంగంపేట హైస్కూల్ విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ బి.వేణు శ్రీలక్ష్మి మాట్లాడుతూ మండలంలో 8,556 మంది పిల్లలకు 8,392 మందికి మాత్రలు వేసినట్టు తెలిపారు. మిగిలిన 164 మంది పిల్లలకు ఈనెల 17న జరిగే మాప్‌అప్‌డే రోజున వేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం వి.పార్థసారథి, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

రాజానగరం: నులిపురుగుల నివారణలో భాగంగా మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో సోమవారం ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. వైద్య సిబ్బంది ప్రతి పాఠశాలకు వెళ్లి ఈ మాత్రలను విద్యార్థులకు అందించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) ఆధ్వర్యంలోని 22 గ్రామాలలో 17,086 మంది విద్యార్థులకు పంపిణీ చేయాలనే లక్ష్యం కాగా, తొలి రోజు 16,500 మందికి అందజేశామని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జి.రామభాస్కర్ తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులతో పాటు వైద్య సిబ్బంది ఎస్‌వీవీ రమణ, సుధ, సోనియా, ఆశ పాల్గొన్నారు.

98 శాతం మాత్రల పంపిణీ

సీతానగరం: మండలంలో 98 శాతం పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశామని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు ఏవీకే చైతన్య తెలిపారు. రఘుదేవపురం హైస్కూల్లో డాక్టర్లు చైతన్య, ఏసురాణి, ఎంఈవో కె.స్వామి నాయక్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. డాక్టర్ చైతన్య మాట్లాడుతూ మండలంలోని ఒకటి నుంచి 19 ఏళ్లున్న 12,519 పిల్లలకు గాను 12,258 మందికి వీటిని పంపిణీ చేసినట్టు తెలిపారు. ఈ రోజు బడికి రాని పిల్లలకు మంగళవారం జరిగే మాపమ్ రౌండ్‌లో మాత్రలు వేస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్యామలాదేవి, ఎంపీహెచ్‌ఈవో వైఎస్ రాయుడు, పీహెచ్‌ఎన్ ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలను మింగిస్తున్న దృశ్యం



రఘుదేవపురం జిల్లా పరిషత్ హైస్కూల్లో..